ప్రజల గుండెల్లో వైఎస్సార్ చిరస్మరణీయులు

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

నెహ్రూనగర్: తెలుగు ప్రజల గుండెల్లో దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎల్లప్పుడు చిరస్మరణీయుడేనని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి రాంబాబు పేర్కొన్నారు. బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా పాల్గొన్నారు. అంబటి రాంబాబు మాట్లాడుతూ ఆయనే బతికి ఉంటే తెలుగు రాష్ట్రాలు విడిపోయే పరిస్థితి ఉండేది కాదని అభిప్రాయపడ్డారు. పోలవరం ప్రారంభించింది డాక్టర్ వైఎస్సార్ అని చెప్పారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నాయని తెలుసుకుని పోలవరం నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. రాయలసీమకు నీళ్లు ఇవ్వాలనే ఉద్దేశంతో హంద్రీ నీవాను ప్రారంభించిన మహానుభావుడు డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. ఆ నీటిని పుంగనూరు వరకు తీసుకువెళితే.. ఆయన తనయుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జలాలను హంద్రీనీవా ద్వారా కుప్పం వరకు తీసుకువెళ్లారని చెప్పారు. కాని నేడు చంద్రబాబునాయుడు తానేదో కృష్ణా జలాలను కుప్పానికి తీసుకొచ్చాను అన్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతోందని చెప్పారు. పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌కే దక్కిందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు రామనబోయిన అజయ్ యాదవ్, బూసి రాజలత, గోపీ వాసు, నాయకులు కొత్తా చిన్నపరెడ్డి, కొలకలూరి కోటేశ్వరరావు, యేటీ కోటేశ్వరరావు, సూరసాని వెంకటరెడ్డి, జగన్‌కోటి, పల్లపు మహేష్, భాస్కర్‌రెడ్డి, బూసి రెడ్డి మల్లేశ్వరరెడ్డి, కొరిటెపాటి ప్రేమ్‌కుమార్, పోకల వసంత్, తుమ్మేటి శ్రీను, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల గుండెల్లో వైఎస్సార్‌కు సుస్థిర స్థానం

పట్నంబజారు: పేదల ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా కీర్తించారు. మహానేత డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి పురస్కరించుకుని తూర్పు నియోజకవర్గంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని ఆయన చిత్రపటానికి, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గడ్డిపాడు, రొట్టెలబడి, సుద్దపల్లిడొంక, మాయాబజారు, రామిరెడ్డితోట, ఆనందపేట, డీఎస్‌నగర్, నల్లచెరువు, మూడుబొమ్మలసెంటర్, బృందావన్‌గార్డెన్స్, ఆదర్శనగర్, లక్ష్మీనగర్, సంగడిగుంట, ఏటుకూరు, రైలుపేట, సంజీవయ్యనగర్, సీతానగర్, మంగళదాస్‌నగర్, శ్రీనగర్, స్వర్ణభారతికాలనీ, లక్ష్మారెడ్డి నగర్‌లలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు డివిజన్‌లలో పేదలకు తోపుడుబండ్లు, నిత్యవసర వస్తువులు అందజేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆయా కార్యక్రమాల్లో పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



కొరిటెపాడు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం



ఆర్థిక సాయం అందజేస్తున్న నూరిఫాతిమా

చిన్నారికి ఆర్థిక సాయం

పట్నంబజారు: దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని అనారోగ్యంతో బాధపడుతున్న చిన్నారికి వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మంగళవారం ఆర్థిక సాయం అందజేశారు. నియోజకవర్గంలోని ఐదో డివిజన్‌కు చెందిన రేష్మ కుమార్తెకు అనారోగ్యంతో ఉన్న నేపథ్యంలో కొద్దిమేర ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆమె కార్యాలయంలో సాయం అందజేశారు.

మహానేత వైఎస్సార్ చిరస్మరణీయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రజా శ్రేయస్సును కాంక్షించి స్వర్ణయుగ పాలనా అందించిన మహానేత డాక్టర్ వైఎస్సార్ చిరస్మరణీయుడని ఇండియన్ ఇంటెలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి అన్నారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మహానేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. ఈసందర్భంగా శాంతమూర్తి మాట్లాడుతూ 40 ఏళ్ల రాజకీయాల్లో ప్రతిపక్షనేతగా ఉన్న వైఎస్సార్ పోటీ చేసిన ప్రతి ఎన్నికల్లో ఓటమి అనేది లేకుండా ప్రజా ప్రతినిధిగా గెలిచి రికార్డు సృష్టించారని అన్నారు. వరుసగా రెండుసార్లు ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టి, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారని అన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

పట్నంబజారు: ప్రజా నాయకుడు దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ కీర్తించారు. స్థానిక 32వ డివిజన్‌లో కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో మంగళవారం డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ విలువలు, విశ్వసనీయతకు సరైన నిర్వచనం డాక్టర్ వైఎస్సార్ అన్నారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) మాట్లాడుతూ సంక్షేమ పథకాల సృష్టికర్త డాక్టర్ వైఎస్సార్ అని కొనియాడారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలో చెరగని ముద్ర వేసుకున్న డాక్టర్ వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళి అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వెలుగూరి రత్నప్రసాద్, బత్తుల దేవానంద్, భాగ్యారావు, శంకర్, విజయమ్మ, విజయ మాధవి, శ్రావణి, గనిక జాన్సీ, డేవిడ్, సింగు నరసింహారావు, సాంబశివరావు, సాగర్ రెడ్డి, ఆదిలక్ష్మి, సంజీవరెడ్డి, గంగాధరరెడ్డి, పుల్లారెడ్డి, పండ్ల నారాయణ, చందు, వెంకటరెడ్డి, గోపీకృష్ణ, రెడ్డి కోటేశ్వరరావు, సుబ్బరాజు పాల్గొన్నారు.



ఆదర్శనగర్‌లో వైఎస్సార్ విగ్రహావిష్కరణలో అంబటి



రైలుపేటలో నివాళులర్పిస్తున్న నూరిఫాతిమా



అవగాహన సంస్థలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంస్థ సభ్యులు

వృద్ధులకు అల్పాహారం.

నెహ్రూనగర్: దివంగత మహానేత డాక్టర వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని 51వ డివిజన్ శ్రీనగర్ 7వ లైనులోని మాతృశ్రీ వృద్ధాశ్రమం వృద్ధులకు అల్పాహారం అందించారు. డివిజన్ అధ్యక్షులు తుమ్మేటి కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూనూరి నాగేశ్వరరావు, తుమ్మేటి శ్రీనివాస్, షేక్ బాజీ పాల్గొన్నారు.

విలువలు, విశ్వసనీయతకు నిదర్శనం వైఎస్సార్

లక్ష్మీపురం: సంక్షేమం, అభివృద్ధి, దూర దృష్టి, విలువలు, విశ్వసనీయ, ఆదర్శ రాజకీయాలు వంటి మాటలు విన్నప్పుడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుకు వస్తారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివరావు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ చెరగని చిరునవ్వుతో ఉండేవారని చెప్పారు. విశ్రాంత ప్రిన్సిపాల్ ఎస్.రవిబాబు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. తన రాజకీయ ప్రస్థానంలో గొప్ప ప్రజా నాయకుడిగా ఖ్యాతి గడించారని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు, న్యాయవాది అవధానుల హరి, అధ్యాపకులు సుబ్బారెడ్డి, శ్రీరామమూర్తి, వెంకటరత్నం పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి

లక్ష్మీపురం: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్, మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు అన్నారు. గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో మంగళవారం దివంగత వైఎస్సార్ వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ దివంగత నేత వైఎస్సార్ ఆశయాలను అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సిందిగా తెలిపారు. ఇరు తెలుగు రాష్ట్రాలలో దివంగత నేత హయాంలో అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసి నేటికి ప్రజల హృదయాల్లో కొలువు తీరు ఉన్నారన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ అడ్మిన్ బిళ్ళా సునీల్ ,రచకొండ జాన్ బాబు, గద్దం పాల్ విజయ్ కుమార్, బొట్ల బ్రాహ్మయయ్య, సయ్యద్ జబిఉల్లా, సుధీర్, బాబు పాల్గొన్నారు.



దివంగత నేత వైఎస్సార్ చిత్రపటం వద్ద పూల మాలలతో నివాళులర్పిస్తున్న దృశ్యం



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాంతమూర్తి తదితరులు



పేదలకు తోపుడు బండ్లు అందజేస్తున్న అంబటి రాంబాబు, నూరిఫాతిమా, ఎమ్మెల్సీ ఏసురత్నం



నందివెలుగు రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నూరిఫాతిమా



డాక్టర్ వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బందా రవీంద్రనాథ్, వెంకటకృష్ణ తదితరులు

క్లుప్తంగా

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



గుంటూరు మెడికల్: ప్రైవేటు ఆస్పత్రుల్లో గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. మంగళగిరి రోడ్డులోని ఆర్కా హాస్పిటల్, ఉదయ్ హాస్పిటల్ రికార్డులు పరిశీలించారు. చికిత్సకు వసూలు చేసే ఫీజుల వివరాలు తెలిపే బోర్డులు ఆస్పత్రుల్లో లేకపోవడాన్ని గమనించారు. వైద్యులు, వైద్య సిబ్బంది సర్టిఫికెట్ల రెన్యూవల్స్ లేని విషయాన్ని గుర్తించారు. ఫైర్ ఆడిట్, ఐసీయుల్లో సరిపడ నర్సింగ్ సిబ్బంది లేరనే విషయాలు తనిఖీల్లో గుర్తించి వాటిని సరిచేసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

ఏఈఎల్‌సీ ఆస్తులను కాపాడాలి



నెహ్రూనగర్: ఆంధ్ర ఇవాంజలికల్ లూథరన్ చర్చి ఆస్తులను కాపాడాలని క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతిబాబు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం లాడ్జిసెంటర్‌లోని ఏఈఎల్‌సీ కార్యాలయంలో సెక్రటరీ జేసు రత్నకుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఈఎల్‌సీ ఆస్తులకు సంబంధించిన నిబంధనలకు విరుద్ధంగా ఉన్న లీజులను రద్దు చేయాలని కోరారు. చర్చి చందాలపై ఆడిట్ జరపాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అరండల్‌పేట 15వ లైనులో 600 గజాల చర్చి స్థలం అన్యాక్రాంతం అయిందని సదరు స్థలాన్ని స్వాధీనపరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ ప్రధాన కార్యదర్శి శరత్‌బాబు, కోశాధికారి మేళం మాణిక్యరావు, వైస్ ప్రెసిడెంట్‌లు డొక్కా జార్జ్, స్వామినాథన్, రాంబాబు, రాజేశ్వరరావు, రత్నకుమార్, ప్రేమ్‌సుందర్, డేవిడ్ పాల్గొన్నారు.

దళిత అధికారులకు నివాళి



నెహ్రూనగర్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు హెలికాప్టర్ ప్రమాదంలో మృతి చెందిన దళిత అధికారులకు దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. మంగళవారం రాత్రి లాడ్జిసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌జే విద్యాసాగర్ మాట్లాడుతూ వైఎస్సార్‌తో పాటు అసువులు బాసిన ఐపీఎస్ అధికారి జాన్ వెస్లీ, ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యంను స్మరించుకోవడం దళితులను గౌరవించుకోవడమేనన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు విల్సన్, నల్లపు నీలాంబరం, బత్తుల అనిల్, సుధా, సురేష్, డేవిడ్ పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంగా ఉండగలరని విశ్రాంత క్రీడా అధ్యాపకుడు వి.అమ్మయ్య తెలిపారు. మంగళవారం అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారునిగా సాధించిన విజయాలు, క్రీడా రంగానికి చేసిన సేవలను గురించి వివరించారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు మాట్లాడుతూ క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ప్రత్యూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ పి. సీతారామయ్య, డాక్టర్ ఏ రాజేష్, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.జవహర్‌బాబు, సహాయాచార్యులు జి.సదాశివరావు, జి.పూర్ణిమ, పీడీ సీహెచ్ అజిత్‌బాబు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనం కనబడకపోవడంతో అరండల్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు కొరిటెపాడు సాకెతపురం 1వలైను ప్రాంతానికి చెందిన ఆట్ల శేషారెడ్డి ఆగస్టు 9న ఇంటి ముందు తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్ చేసి, మరుసటి రోజు ఉదయం చూసేసరికి వాహనం కనిపించలేదు. రైల్వే స్టేషన్, బస్టాండ్, చుట్టుపక్కల వెతికినా వాహనం కనిపించలేదు. దీంతో చోరీకి గురైందని భావించిన బాధితుడు శేషారెడ్డి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు: 33కేవీ ఆర్టీసీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా బుధవారం నిలిపివేయనున్నట్లు గుంటూరు –4 డీఈఈ పీహెచ్ ఖాన్ మంగళవారం తెలిపారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. శివాలయం, నందివెలుగు రోడ్, వినోభానగర్, జాకీర్ హుస్సేన్ నగర్, ఎల్‌బీ నగర్, క్రిస్టియన్ పేట, కొండయ్య కాలనీ, బీఆర్ స్టేడియం, అంకమ్మ తల్లి టెంపుల్, ఆంజనేయ స్వామి టెంపుల్, బావాజీ మఠం, అలీ నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

వన గణపతిగా వినాయకుడు



నగరంపాలెం: స్థానిక ఏటుకూరురోడ్డు శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం వద్ద 27వ గణేష్ చతుర్థి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం, సహస్ర నామార్చన వేద పండితులు నిర్వహించారు. స్వామి వారిని వన గణపతిగా అలకరించారు. భక్తులు పెద్ద ఎత్తున్న తరలివచ్చి గణనాథుని దర్శించుకున్నారు. తీర్థ ప్రసాదాలు అందించారు. కార్య క్రమంలో వాసవి యూత్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల నాగేశ్వరరావు, కార్యదర్శి పువ్వాడ నాగవెంకటనారాయణ, కోశాధికారి కాజా శ్యాంసుందర్, ప్రోగ్రాం కమిటీ చైర్మన్ అన్నారామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

పుష్ప గణపతిగా దర్శనం

నెహ్రూనగర్: 21వ డివిజన్ వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య ఆధ్వర్యంలో కేవీపీ కాలనీ 1/10వ లైనులో 19వ గణపతి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. మంగళవారం పూల అలంకరణలో గణనాథుడు భక్తులకు దర్శనమిచ్చాడు.

నూతనత్వమే భవిష్యత్ విజయాలకు పునాది

పారిశ్రామికవేత్త చుక్కపల్లి రాకేష్

గుంటూరు ఎడ్యుకేషన్: కృత్రిమ మేధ ఆధారంగా వేగంగా మారుతున్న ఆధునిక కాలంలో నూతనత్వమే భవిష్యత్ విజయాలకు పునాది అవుతుందని పయినీర్ ఆటోమోటివ్స్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ అన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) సహకారంతో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాకేష్ మాట్లాడుతూ సాంకేతికతలో నైపుణ్యం, కొత్త ఆలోచనలతో ముందుకెళ్లే ధైర్యం కలిగినవారే భావి పరిశ్రమలను నడిపిస్తాయని అన్నారు. చదువుతో పాటు పరిశ్రమల అవసరాలు, మార్కెట్ డిమాండ్స్‌ను అర్థం చేసుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ సెల్ కొత్త శక్తిని, దిశను అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి. చక్రవర్తి, సహాయాచార్యులు చల్లా వైష్ణవి, సీహెచ్ వేదవతి, షేక్ షబానా పర్వీన్, బాజీబాబు, అభిలాష్, అనిత, రాజేశ్వరి, ఉమాదేవి వెంకట కల్యాణ్, ఎంసీఏ విభాగాధిపతి రాజ్యలక్ష్మి, అధ్యాపకులు, పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

లక్ష్మీపురం: నేత్ర దానానికి ముందుకు రావాలని శంకర ఐ ఆస్పత్రి ఐ బ్యాంక్ కో ఆర్డినేటర్ ఎం.సురేంద్ర కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ఎవరైనా నేత్రదానం చేయవచ్చని అన్నారు. కుటుంబ సభ్యుల అంగీకారం అవసరమని ప్రతి ఒక్కరూ ఈ మంచి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడుతూ నేత్రదానం చేయటగాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. అవగాహన సంస్థ తరుపున విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. అనంతరం సురేంద్రను ఘనంగా సత్కరించారు.

అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: ప్రజల నుంచి అందే అర్జీలు, సేవా దరఖాస్తులను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలని, నిర్దేశిత గడువు దాటిన దరఖాస్తులు ఉన్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారి, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, అధికారులు, సిబ్బందితో గ్రీవెన్స్, సేవా దరఖాస్తుల పరిష్కారంపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ విభాగాల వారీగా అర్జీల పరిష్కారం సమీక్షించారు. విభాగాల వారీగా ప్రతి విభాగంలో సూపరింటెండెంట్ అర్జీల పరిష్కారానికి బాధ్యత తీసుకోవాలని, అర్జీల పరిష్కారం కోసం క్షేత్ర స్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవడానికి ప్రత్యేకంగా ఆపరేటర్లకు విధులు కేటాయించాలని కోరారు. వచ్చే వారం నుంచి నిర్దేశిత గడువు మేరకు పరిష్కారం చేయని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని అదనపు కమిషనర్‌ని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ రామారావు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

నగరానికి అధ్యాయన కమిటీ బృందాలు..

నగరపాలక సంస్థ జాతీయ స్థాయిలో స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీస్‌లో ఉత్తమ స్థానం సాధించిన నేపథ్యంలో గుజరాత్, ఇండోర్, చండీఘర్‌ల నుంచి అధ్యాయన కమిటీ బృందాలు గుంటూరు నగరానికి రానున్నాయని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. జాతీయ స్థాయిలో అందిన స్ఫూర్తితో గుంటూరు నగరాన్ని మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుకోవడంలో నగర ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, ప్రజారోగ్య కార్మికులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. మంగళవారం శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్పొరేటర్లు, విభాగాధిపతులు, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బందితో నగరంలో పారిశుద్ధ్యం మెరుగుదలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సీహెచ్ శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, సిటీ ప్లానర్ రాంబాబు, ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామి రెడ్డి, ఇన్‌చార్జి ఎంహెచ్‌ఓ రామారావు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కమిషనర్

ఆవులను రోడ్ల మీద కనిపిస్తే బందెలదొడ్డికి తరలిస్తాం

నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆవులు, ఎద్దులు, దూడలను ఈనెల 7వ తేదీ నుంచి వెంగళాయపాలెం లోని జీఎంసీ బందెలదొడ్డికి తరలించనున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిన్నాటవర్ నుంచి ఆక్రమణల తొలగింపు..

జిన్నా టవర్ సెంటర్ నుంచి మణిపురం బ్రిడ్జి వరకు రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణ చేసుకొని, ట్రాఫిక్ సమస్య, మురుగుపారుదలకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణదారులు ఈ నెల 6వ తేదీ నాటికి స్వచ్ఛందంగా తొలగించుకోవాలని తుది హెచ్చరిక చేస్తున్నామని, లేకుంటే జీఎంసీ సిబ్బందే స్పెషల్ టీంలతో ఆక్రమణలను సమూలంగా తొలగిస్తారని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పోరాటాల ద్వారానే హక్కుల సాధన

లక్ష్మీపురం: పోరాటాల ద్వారా హక్కుల సాధన సాధ్యమని సీఐటీయూ నగర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. గుంటూరు నగరంలోని బొంగరాల బీడు, శారదాకాలనీ, రాజీవ్ గాంధీనగర్, లాలాపేట, లాంచెస్టర్ రోడ్డు, అర్బన్ హెల్త్ సెంటర్‌లలో మంగళవారం ఆశ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఆశ వర్కర్‌లకు పారితోషకం రూపంలో వచ్చేవని, యూనియన్ పోరాట ఫలితంగా జీతం రూ.10,000 జీతం వస్తుందని చెప్పారు. గుంటూరులోని సీఐటీయూ ఆఫీసులో ఈనెల 4వ తేదీ నిర్వహించనున్న ఆశ వర్కర్స్ యూనియన్ గుంటూరు నగర మహాసభను జయప్రదం చేయాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కొత్తపేట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ డి.రమేష్ పేర్కొన్నారు. మంగళవారం సాంబశివపేటలోని ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం వలన కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలకు యువత ఎక్కువగా బానిసలుగా మారతున్నారని, మత్తు పదార్థాలకు అలవాటు పడితే ఏకాగ్రతను కోల్పోయి మానసికంగా కృంగిపోతారని వివరించారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం జోనల్ కో–ఆర్డినేటర్ ఎస్.జాకబ్ రాజు మాట్లాడుతూ నూజివీడు మండలం పొలసానాపల్లిలో నవజీవన్ బాల భవన్ సంస్థ నిర్వహిస్తున్న బోస్కో డీ–ఎడిక్షన్ కేంద్రంలో ఉచిత సేవలు పొందవచ్చునని, వివరాలకు 94904 92020 నంబర్లో సంప్రదించాలని సూచించారు.

ఆర్య సమాజం పూర్వ కార్యదర్శి మల్లికార్జునరావు మృతి

నగరంపాలెం: జిల్లా ఆర్య సమాజం పూర్వ కార్యదర్శి కొత్తమాసు మల్లికార్జునరావు(65) మంగళవారం కంకరగుంట వద్దనున్న ఓ అపార్ట్‌మెంట్‌లోని ప్లాట్‌లో మృతి చెందారు. భార్య మంజువాణి, కుమార్తె కళ్యాణి అనుమతి మేరకు ప్రజా ఆలోచన వేదిక సహకారంతో ఆయన నేత్రాలను శంకర నేత్ర ఆసుపత్రికి దానం చేశారు. ఆయన భౌతిక కాయం వద్ద ఆర్య సమాజం జిల్లా అధ్యక్షురాలు గుర్రం నిర్మలదేవి, ప్రజా ఆలోచన వేదిక అధ్యక్షులు మేడూరి రాజేంద్రప్రసాద్, కన్వీనర్ వల్లూరి సదాశివరావు, గింజుపల్లి భాస్కరరావు, గోపదేవ్ తదితరులు నివాళులర్పించారు.

అలరించిన శ్రీరామ జననం హరికథా గానం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పద్మావతి కళ్యాణ వేదికపై శ్రీ నారాయణ దాస జయంతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఆదిభట్ల నారాయణదాస కథాకరణ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో చేపట్టగా, మంగళవారం హరికథాగానం నిర్వహించారు. ఆలయ కమిటీ, సంస్థ నిర్వాహకులు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. పురాణం విజయలక్ష్మి(కొవ్వూరు) మాట్లాడుతూ శ్రీరామ జననం ఇతివృత్తం అంటే త్రేతాయుగంలో అయోధ్యలో రాముని జన్మించిన కథ అన్నారు. శ్రీరాముడు ధర్మాన్ని స్థాపించేందుకు, దుష్టశక్తులను సంహరించేందుకు విష్ణువు అవతారంగా జన్మించాడని పేర్కొన్నారు. అనంతరం సంస్థ నిర్వాహకులు డాక్టర్ రాజ్యలక్ష్మి, కర్రా సూర్యనారాయణదాస్ పర్యవేక్షించారు.

వైభవంగా లలితా పారాయణం

నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం చాతుర్మాస దీక్షలు నిర్వహించారు. శ్రీకన్యకా లలిత పారాయణ మహిళా సమాజం ఆధ్వర్యంలో లలితా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. శ్రీవామనాశ్రమ స్వామీజీ మాట్లాడుతూ లలితా పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం వలన సకల పాపాలు హరిస్తాయని అన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో నూనె జయశ్రీ, మహంకాళి సునీత, వాణి, రాజేశ్వరి పాల్గొన్నారు.